www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 నవంబర్ 2025
5

వైఎస్ఆర్

19న బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన అంతర కళాశాలల బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళల) సింగిల్స్, డబుల్స్ విభా గాలలో పోటీలు బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహిం చనున్నట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థలలో చదవి ఉండాలని పేర్కొన్నారు. తమవెంట ఒరిజినల్ స్టడీ సర్టిఫికేట్ తో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలపై అటెస్ట్ చేయించి తీసుకురావాలని తెలిపారు. క్రీడాకారుల వయోపరిమితి 17 సంవత్సరాలు పైబడి 25 సంవత్సరాలు లోపు ఉండవలని పేర్కొన్నారు. వివరాలకు 9705459052 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

భృతి..అంతా భ్రాంతి!

- రూ.3 వేల కోసం యువత ఎదురుచూపులు
- ఉద్యోగమూ లేదు.. భృతీ లేదు..!
- 17 నెలలైనా అమలుకు నోచని హామీ
- ఇతర రాష్ట్రాలకు యువత వలస
- వర్క్‌ఫ్రం హోం పేరుతో వివరాల సేకరణ..
- ఊసే లేని జాబ్ కేలండర్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కూటమి అధికారంలోకి వస్తే ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని అందులో భాగంగా యువగళం పథకం ద్వారా యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తాం. ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3 వేల భృతి చెల్లిస్తాంమని కూటమి ప్రభుత్వ పాలకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. అయితే ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 17 నెలలైనా దాని ఊసే ఎత్తడం లేదు. మూడు నేలల క్రితం వర్క్ ఫం హోం అంటూ నిరుద్యోగుల వివరాలు సేకరించిన ప్రభుత్వం నేటికీ వర్క్ చూపలేదు. జిల్లాలో 54 వేల మంది దాకా అర్హులైన వారు ఉన్నారు. వీరు ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఇతర రాష్ట్రాలకు యువత వలస

ఎంటెక్, బీటెక్, డిగ్రీ ఇతర వృత్తి విద్య కోర్సులను చేసిన నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కర్నాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. ప్రతి ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చొరవ చూపడం లేదంటూ నిరుద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఊసే ఎత్తని కూటమి పాలకులు

ఇంటికో ఉద్యోగం.. అంతవరకూ నిరుద్యోగభృతి అంటూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊరూరా ప్రచారం చేశారు. నమ్మి అధికారం కట్టబెట్టిన యువతను పాలకులు వంచించారు. జిల్లాలో ఇంటర్ సమానమైన వృత్తి విద్య, డిగ్రీ, పీజీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు దాదాపు మూడు లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి సారించలేదు. జిల్లాలో భూమి, నీటి వనరులు ఉన్నప్పటికీ ఒక్క కొత్త పరిశ్రమను స్థాపించలేదు. ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందేమోనని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే ఎదురవుతోంది. ఉద్యోగాల భర్తీ గురించి.. నిరుద్యోగ భృతి చెల్లింపు గురించి పాలకులు నోరు మెదపడం లేదు.

గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాలు మాత్రమే

గత ప్రభుత్వం తొలి రెండేళ్లలోనే 4 లక్షల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేసి సరిపెట్టింది. వాలంటీర్లు నియమించి లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పన దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కనీసం యువతకు నిరుద్యోగ భృతి కూడా చెల్లించలేదు. అధికారంలోకి రావడం కోసం హామీలు ఇచ్చి.. తర్వాత విస్మరించడం పట్ల ప్రభుత్వంపై యువత అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

మెగా డిఎస్‌సితో సరిపెట్టారు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయగానే మెగా డిఎస్‌సి ఫైల్‌పై తొలి సంతకం చేశారు. 16 నెలలకు డిఎస్‌సి పూర్తిచేసి రాష్ట్రంలో 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జాబ్ కేలండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తారని యువత ఆశపడింది. 17 నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

నిరుద్యోగ భృతికి అర్హత

కనీసం డిప్లమో లేదా డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసి, వయస్సు 20 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగం లేదా ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్న వారు ఈ పథకానికి అర్హులు కాదు. ఇపిఎఫ్ అకౌంట్ లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. కుటుంబానికి 5 ఎకరాల కన్నా తక్కువ భూమి ఉండాలి. నాలుగు చక్రాలు వాహనం ఉండకూడదు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు ఉండకూడదు.పింఛన్ పొందుతున్న వారు ఈ పథకానికి అనర్హులు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ప్రతి జిల్లాకు పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఉద్యోగం కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలి. నిరుద్యోగ భృతి పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులకు తోడ్పడుతుంది.

- రఘునాథ్‌రెడ్డి, బీటెక్, పులివెందుల.

జాబ్ కేలండర్ ప్రకటించాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ కేలండర్ నిరుద్యోగులకు ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని విస్మరించింది. ఇంటికో ఉద్యోగం లేకపోతే డిగ్రీ పూర్తి చేసిన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఉద్యోగాలు ఇవ్వలేదు. భృతి ఇవ్వలేదు. ఇంత వరకు ఆ హామీ అమలు గురించే పట్టించుకోకపోవడం దారుణం.

- శివకుమార్, జిల్లా కార్యదర్శి, డివైఎఫ్ఐ, కడప.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప

భూ రికార్డుల స్వచ్ఛీకరణ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లోని రెవెన్యూ రికార్డులను గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దే చర్యలను ముమ్మరం చేస్తున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న భూ సమస్యలపై రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణతో గోల్డెన్ రికార్డుల సాధన కోసం సంబంధిత రెవెన్యూ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మంగారిమఠం మండలానికి ఏర్పాటు చేసిన 20 మంది విఆర్ఒలు, విలేజ్ సర్వేయర్లతో కూడిన ప్రత్యేక టీమ్ సభ్యులకు కలెక్టర్ పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల భూ ఆక్రమణలు, భూ రికార్డుల్లో తప్పిదాలు జరిగాయన్నారు. ప్రత్యేకించి బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో పాటు, బి.మఠం మండలంలో అధిక సంఖ్యలో భూ సమస్యలు ఉన్నట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు అందడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక టీముల ద్వారా అన్ని గ్రామాలలో రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రతి సర్వే నెంబర్‌ను, సంబంధిత విస్తీర్ణాన్ని ఆర్ఎస్ఆర్, వెబ్ ల్యాండ్ ద్వారా నమోదు చేయడం జరుగుతోందన్నారు. పట్టా, అసైన్డ్ భూ రికార్డులన్నింటినీ ఒక ఎస్ఓపి ప్రకారం పట్టాదారు, అనుభవాదారు, 22ఎ, డికెటి, పిఒటి భూములు, వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని వెరిఫై చేసి రికార్డుల వర్గీకరణ చేయడం జరుగుతుందన్నారు. అత్యంత ప్రధాన్యతతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎటువంటి తప్పిదాలు, ఎలాంటి వ్యక్తిగత, రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా వెరిఫికేషన్ చేయాలని ప్రత్యేక టీమ్ సభ్యులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎలాంటి కోర్టు వ్యవహారాలు, కుటుంబ వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ కార్యక్రమాన్ని ఆధునిక పరిజ్ఞానంతో చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జెసి అదితి సింగ్, బద్వేలు ఆర్‌డిఒ చంద్రమోహన్, కుడా సెక్రెటరీ శిరీష, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు విఆర్ఒలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పద్మావతి ఏజెన్సీ అరాచకాలను అరికట్టాలి : సిఐటియు

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిజిహెచ్‌లో పద్మావతి ఏజెన్సీ అరాచకాలను అరికట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షులు రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం తొలగించిన సూపర్వైజర్లను తిరిగి విధులకు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిజిహెచ్‌లో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లను అకారణంగా తొలగించడం దారుణమని పేర్కొన్నారు. జిజిహెచ్ ప్రారంభం నుంచి శానిటేషన్ విభాగంలో సూపర్వైజర్లుగా కొనసాగుతున్న వారిని కొత్తగా వచ్చిన పద్మావతి హౌస్కీపింగ్ సర్వీస్ వారు తొలగించడం అన్యాయమన్నారు. ఎవరినైనా తొలగించాలంటే ముందుగా నోటీసులు ఇవ్వాలి, తర్వాత వాటిపైన వారు సంతృప్తి చెందకుండా ఉంటే వారిని తొలగించాలని తెలిపారు. పద్మావతి హౌస్ కీపింగ్ సర్వీస్ వారు ఎంఒయులో డిగ్రీ అర్హత ఉండాలి ఉండాలి, వీరికి లేదని చెబుతున్నారన్నారు. కొత్తగా రిక్రూట్మెంట్ చేసుకునే వారికి డిగ్రీ అర్హత ఉండాలి, మూడు సంవత్సరాలు సర్వీస్ ఉండాలి అని ఏ నోటిఫికేషన్ ఇచ్చిన కూడా ఉంటుందని చెప్పారు. పాతవారిని తీసేయాలని ఏ అగ్రిమెంట్లలో ఉండదని పేర్కొన్నారు. వీరికి అర్థం కాకనో లేకుండా ఉంటే కావాలని తొలగించాలని ఉద్దేశంతోనో వీరు తొలగించారో, అధికారులను మాత్రం కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వయోపరిమితి 50 సంవత్సరాలు ఉండాలని చెబుతున్నారు, కొత్తగా వచ్చిన నోటిఫికేషన్లలో అప్లై చేసుకునే వారు ఇన్ని సంవత్సరాలు ఉండాలని ఉంటుందే తప్ప పాతవారిని తొలగించాలని ఏ నోటిఫికేషన్లలో ఉండదని తెలిపారు. వీరు ఉద్దేశపూర్వకంగానే సూపర్వైజర్లను తొలగించారని, తరువాత కార్మికులను తొలగించాలని ఉద్దేశంతో ఉన్నారనేది ఈ తొలగింపులను చూస్తే స్పష్టంగా అర్థమవుతుందని వారన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు కడప నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, సిఐటియు ఆఫీస్ సెక్రటరీ ఉదయ్, రఘు, శీను, రిమ్స్ సూపర్వైజర్స్ సుబ్బారెడ్డి, శివ, సుభాషిని, గంగాదేవి, ఉమా, చంద్ర, ఆదామ్, బాలకృష్ణ, వెంకటేష్, వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అమర్ పాల్గొన్నారు.

ప్రమాణం చేయిస్తున్నఎంపిడిఒ మల్లేశ్వరి

బాలికను రక్షిద్దాం..చదివిద్దాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బద్వేలు

బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దామని ఎంపిడిఒ మల్లేశ్వరి, సిడిపిఒ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహ నిరోధక చట్టంలోని సెక్షన్ 3 కింద 18 ఏళ్లు నిండని అమ్మాయి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయి పెళ్లి చేసుకుంటే, ఆ వివాహం చట్టపరంగా చెల్లదని పేర్కొన్నారు. ప్రోత్సహించిన పెద్దలకు రెండేళ్లు జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా ఒక్కోసారి రెండు విధించవచ్చునని సెక్షన్ 13 ప్రకారంగా నిషేధ ఆదేశాలు ఇచ్చి బాల్యవివాహం జరగకుండా అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. బాలికల జననం యొక్క ప్రాముఖ్యత, బాలల రక్షణ, పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టాల గురించి వివరంగా వివరించారు. బాలల న్యాయ చట్టం 2015 ఆధారంగా బాలల సంక్షేమ సమితి వారు బాలల సంరక్షణ, పునరావాసం, రక్షణ కోసం ఈ కమిటి తగు చర్యలు తీసుకుంటుందని సున్నా నుండి 18 ఏళ్ల పిల్లలకు ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లాలోని బాలల సంక్షేమ సమితి కడప వారిని సంప్రదించవచ్చని తెలిపారు. టి.సువర్ణ మాట్లాడుతూ కిషోరి వయసులో ఉన్న పిలలకి ఆరోగ్య పరమైన విషయాలను, పోషకహారం మరియు వ్యక్తిగత శుబ్రత మొదలగు విషయాల గురించి తెలిపారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ ఎం.కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

ప్రజాశక్తి-కలసపాడు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపిడిఒ మహబూబ్‌బి అన్నారు. గురువారం మండలంలోని మండల పరిషత్ సభా భవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు డిప్యూటీ ఎంపిడిఒ మురళీమోహన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ సీతారాంరెడ్డి, టిటిటిఎస్ సృజన, శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు. **వల్లూరు:** మండలంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, విఒఎలకు, సిఆర్‌పిలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండు రోజులు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రఘురాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో మండలంలోని అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో అన్ని శాఖలలో ఏమైనా సమస్యలుంటే ఈ శిక్షణ తరగతులలో చర్చించుకుని గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు మెరుగు పరిచేందుకు ప్రణాళికలపై చర్చించు కున్నట్లు తెలిపారు. పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశు భ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛమైన గాలి ప్రతి ఒక్కరికి అందేలా పచ్చదనం పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలసపాడు : శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

టిడిపి మండల అధ్యక్షుడిగా భైరవ ప్రసాద్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా భైరవ ప్రసాద్‌ను పార్టీ అధిష్టానం నియ మిం చింది. గురువారం బద్వేలులోని వీరారెడ్డి కాలేజీ ఆవరణంలో ప్రమాణ స్వీకారం చేశారు ప్రమాణ స్వీకారం అనం తరం ఆయన మాట్లాడుతూ బద్వేల్ ఇన్‌ఛార్జి రితిష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి రితిష్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాపై నమ్మకం పెట్టుకొని రెండవ సారి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో పార్టీకి నేను చేసిన కృషిని అధిష్టానం గమనించి నాకు రెండవసారి అధ్యక్ష పదవి అప్పగించారన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నితిష్‌రెడ్డి ఆదేశాలను అనుసరిస్తూ పార్టీని మండలంలో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

గనుల నిర్వహణపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కడప

జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జెసి అదితి సింగ్‌తో కలిసి జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణపై సంబంధిత మైన్స్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. జిల్లాలోని గనుల నిర్వహణ పనితీరుపై సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని గనులు నిర్వహణలో ఉన్నాయి? నిర్వహణలో ఉన్న అన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు లోబడి నిర్వహణలో ఉన్నాయా? అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తున్నారా? సామాజిక బాధ్యత, వార్షిక రాబడి, ఆదాయం తదితర అన్న అంశాలపై సమీక్షించిన కలెక్టర్ మరిన్ని వివరాలు, పూర్తి సమాచారంతో తదుపరి సమావేశానికి హాజరవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య మైన్స్ డిడి సుబ్రమణ్యం, మైన్స్ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ సుధ, రాయల్టీ ఇన్స్పెక్టర్‌లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగుల పట్ల చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - కడప

ఎయిడ్స్ రోగుల పట్ల చిన్నచూపు, వివక్షత, అభద్రతాభావం కలిగి ఉండకూడదని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ సంయుక్తంగా హెచ్ఐవి బాధితులు, వారి కుటుంబాల పిల్లలతో గురువారం డిస్ట్రిక్ట్ లెవెల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పతకాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి అనేది సాధారణ వ్యాధి అని ఈ వ్యాధికి చికిత్స కూడా ఉందని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తారన్నారు. చికిత్సతో పాటుగా మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మనో ధైర్యంతో జీవించాలని సూచించారు. అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడుతున్న వారిలో యువత పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. మహిళ శిశు సంక్షేమ శాఖ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధిత కుటుంబములోని పిల్లలకి మిషన్ వాత్సల్య పతకంలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎంఇఒ రఫీక్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లోఎయిడ్స్ బాధిత కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్లస్టర్ హెచ్ఐవి నియంత్రణ విభాగం అధికారి భాస్కర్, వికసిత ఫౌండేషన్ ద్వారా అధ్యక్షులు లక్ష్మీదేవి, పోసిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షులు ఉష, డిస్ట్రిక్ట్ సూపర్వైసర్ పివి.ప్రసాద్, ఎఆర్‌టి సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది, ఐసిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

భారీ స్కోరు సాధించిన నెల్లూరు జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 70.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని కిన్నోకిషల్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 124 బంతులను ఎదుర్కొని 24 బౌండరీలు, రెండు సిక్సర్ల సహాయంతో 163 పరుగులు చేశాడు. సూర్య ప్రకాష్ 65, కార్తీక్ 51 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని తేజ్ 3, శరణ్యరెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 51 పరుగులు చేసింది. నెల్లూరు జట్టులోని శ్రీరామ్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో కడప 289 ఆలౌట్

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.2 ఓవర్లలో 289 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి కృష్ణ చైతన్య 107 పరుగులు చేశాడు. శివ చరణ్ 65 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రక్షణ సాయి ఐదు, భువన్ సాయి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో ఆట ముగిసే సమయానికి 7.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 11 పరుగులు చేసింది.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కడపఅర్బన్: ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా అర్జున్ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ అర్జున్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు, ఆర్‌బిఎస్, బిపి, ఇసిజి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత పరీక్షలు ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కడప అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఇ.పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల గ్రంథాలయాలలో వారోత్సవాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14న ఐదో తరగతి లోపు విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణ, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాటల పోటీలు ఉంటాయని తెలిపారు. 15న వ్యాసరచన పోటీలు, 16న వకృత్వ పోటీలు, 17న చెస్ పోటీలు, 18న క్విజ్ పోటీలు, 19న చిత్రలేఖన పోటీలు, 20న ముగింపు సమావేశం సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పాల్గొని వారోత్సవాలు విజయవంతం చేయాలని తెలిపారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ఆర్‌కె నగర్ సమస్యలపై 17న నిరసన : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగర పాలక సంస్థ ఏర్పడి 20 సంవత్సరాలు దాటినా నేటికీ మౌలిక సమస్యలు పరిష్కరించడంలో కార్పొరేషన్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. గురువారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం నేతలు పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ నగర్‌లో 2 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రధాన రోడ్లు మినహా వీధుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. వర్షం వస్తే ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మురిగినీరు రోడ్డు మీద పేరుకుపోవడం వల్ల వివిధ రకాల జబ్బులు వస్తున్నాయని పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీటితో పాటు విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. దోమలు విపరీతంగా ఉన్నాయని, వాటి నియంత్రణ కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నగర పాలక సంస్థ కమిషనర్ పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఉదయం 10 గంటలకు కడప కార్పొరేషన్ ఎదుట నిర్వహించే ఆందోళనలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటనలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, నరసింహ, శేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలి : పీడీ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

డ్వాక్రా సంఘాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని సుస్థిరమైన జీవనోపాదులను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో అధ్యక్షులు కల్పన ఆధ్వర్యంలో మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ప్రతి మహిళా తీసుకొంటున్న రుణాలను సక్రమంగా వినియోగించుకొని సుస్థిరమైన జీవనోపాధులను ఏర్పాటుచేసుకోవాలని పేర్కొన్నారు. మండల సమాఖ్య ద్వారా స్మార్ట్ కిచెన్ నిర్వహణకు కమిటీలుగా ఏర్పడి స్మార్ట్ కిచెన్ నిర్వహణ విజయవంతముగా చేయాలని తెలిపారు. మధ్యాహ్నం భోజనం క్వాలిటీ గురించి ఎంఎస్ఇసి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని అంశాల పైన సమీక్షించారు. కార్యక్రమంలో ఎపిడి, ఎపిఎం, సిసిలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

మాట్లాడున్న పీడీ రాజ్యలక్ష్మి

అంబేద్కర్ గురుకులానికి భద్రత ఏదీ..!

కనిపించని సిసి కెమెరాలు - లోపించిన పారిశుద్ధ్యం

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో సిసి కెమెరాలు లేకపోవడంతో భద్రత కరువైందని విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. వెలుపలి వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించే పరిస్థితులు నెలకొన్నాయి. విలేకరులకు అనుమతి నిరాకరించడం ద్వారా నిజ పరిస్థితులు వెలుగులోకి రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. హాస్టల్ పరిసరాలు మురికి నీటితో నిండిపోవడం, మరుగుదొడ్లకు తగిన శుభ్రత లేకపోవడం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. భోజనశాలలో పరిశుభ్రత లోపించడం వల్ల అనారోగ్య భయం విద్యార్థుల్లో నెలకొంది. దీనిపై తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు భద్రతతో, ఆరోగ్యకర వాతావరణంలో చదివేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగు పరచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం వెంకటనారాయణ

డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు

ప్రజాశక్తి - తొండూరు

స్థానిక వెలుగు కార్యాలయములో గురువారం మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామ సంఘంలోని సంధ్య స్వయం సహాయక సంఘం సభ్యులకు డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రణాళిక ప్రకారం రూ.20లక్షలు వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట నారాయణ మంజూరు చేశారు. సభ్యులకు పాడి గేదెలు, గొర్రెలు, మేకలు తప్పక కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ జిలానిబాషా, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ అనురాధ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పగిలిన మ్యాన్ హోల్..పట్టని అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని గోపి విహార వీధిలో నడిరోడ్డుపైన మ్యాన్‌హోల్ పగిలినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి.

పగిలిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు హడలిపోతున్నారు. ఈ రహదారిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో నిత్యం రోగులు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు అధికంగా తిరుగుతూ ఉంటారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రమాదం అవకాశం ఉందని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తెగులు ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వరి పొలాల్లో మాని పండు తెగులు, కాటుక తెగులు ఉధృతి అధికంగా ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ దేవి పద్మలత తెలిపారు. గురువారం చాపాడులో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగులుతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. వరిలో మానిపండు తెగులు, కాటుక తెగులు ఆశించినట్లయితే కాపర్ ఆక్సీకోరైడ్ 3 గ్రాములు, కార్బెండజిమ్ 1 గ్రాము, ప్రొపికోనజోల్ 1 మిలీ లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - మైదుకూరు టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీసీ,ఎస్టీ,ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు విలియం కలమలమెట్ట కోరారు. గురువారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు విలియం, కనకరాజు, సుబ్బరాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : వేంపల్లెలోని ఐటిఐ ఫీడర్ లైన్‌లో మరమ్మతులు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటన తెలిపారు. 33/11 కెవి వేంపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రిజిస్టర్ ఆఫీసు, చర్చి లైన్, కెనరా బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, పిరమిడ్ నగర్, జిఎం కాంప్లెక్స్, నాలుగు రోడ్ల కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

కేబుల్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇద్దరు కేబుల్ దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని పులివెందుల డిఎస్పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక డిఎస్పి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం నుంచి లింగాల మండలంలో రైతుల తోటల దగ్గర ఉన్న మోటర్ల కేబుల్ దొంగతనాలు చేశారన్నారు. వీరు కేబుల్ తరలిస్తుండగా మురాచింతల క్రాస్ వద్ద పొద్దుటూరుకు చెందిన జమ్మయ్య, నాగరాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆటో, మోటర్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటరమణ, లింగాల ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్పి మురళి నాయక్

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ

వరి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎడి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వరి పండించిన రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నట్లు పులివెందుల వ్యవసాయ శాఖ సహయ సంచాలకులు అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడుపులపాయి-2 రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఎడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ, అలిరెడ్డిపల్లె గ్రామాల్లో దాదాపు 700 మంది రైతులు వెయ్యి ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వరి రైతుల ద్వారా ధాన్యం సేకరించేందుకు ఇడుపులపాయి-2లో వరి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వరి సాగు చేసిన రైతులు ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తేమ శాతం 17 శాతానికి మించరాదన్నారు. చెత్త, రాళ్ళు, తాలు ఒక శాతానికి మించరాదని తెలిపారు. చెడిపోయిన, రంగు మారిన ధ్యానం 5 శాతానికి మించరాదని చెప్పారు. పరిపక్వానికి రాని, వంకర తిరిగిన గింజలు 3 శాతానికి మించకూడదన్నారు. సూచనలుకు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని రైతులు సంప్రదించాలని ఎడి కోరారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సురేఖ, మహేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖాజీపేట: వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్రం ఏర్పాటు చేశామని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నాగార్జున కోరారు.మండలంలోని పుల్లూరులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేడ్-ఏ రకం రూ.2,389, సాధారణ రకం రూ.2,369 గా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. మద్దతు ధర పొందాలంటే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సంచులు మిల్లర్లు ద్వారా రైతులకు ఇస్తామన్నారు. రవాణా ఖర్చు ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డిపిఎం ప్రవీణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి ధాన్యంలో నీటి శాతం కనుగొనే పరికరాల పరిశీలన

చాపాడు : రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన చర్యలు చేప డుతున్నట్లు ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు.

మండల పరిధిలోని అన్ని సచివాలయాలల్లో ధాన్యంలో నీటి శాతాన్ని నిర్ణయించే పరికరాలను సిద్ధం చేశామన్నారు. మండలంలో 18,500 ఎకరాలు వరి సాగైందన్నారు. వరి కోతలు ప్రారంభమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వరి కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. చాపాడు, అన్నవరంలో రెండు వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేవి పద్మలత, ఎఇఒ స్వప్న పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

గ్రామపంచాయతీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ముఖ్యఅతిథిలుగా ఎంపిపి వీర నారాయణరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సుస్థిరత, అభివృద్ధికి మంచి ఆదాయ వనరులకు గ్రామ పంచాయతీలు కీలకమన్నారు. సొంత ఆలోచనలతో స్థానికంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రతి మండలంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ముద్దనూరు : గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పం చాయతీ కార్యదర్శులకు క్లిన్ అండ్ గ్రీన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఎంపిడిఒ సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలన్నారు. రోడ్లు శుభ్రం చేయాలన్నారు. ఈఒపిఆర్డీ వీర భద్రుడు, కార్యదర్శి లక్ష్మి నరసిం హులు పాల్గొన్నారు.

చక్రాయపేట : ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పచ్చదనం, పరిశుభ్రత గురించి సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ కె.శివారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. శిక్షణ రుషికేశ్వర సర్పంచ్‌లకు, కార్యదర్శులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ విజయ్‌కుమార్ నాయక్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పంచాయతీ సర్పంచులు ఎర్రబొమ్మనపల్లె, కె.ఎర్రగుడి, మారెళ్ళమడక, గండి కొవ్వూరు, లక్ష్మయ్య, హరిశేఖర్ నాయుడు, నరసింహులు, కిరణ్ కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగయ్య, శ్రీనివాసులు, శీను, బ్రహ్మ దేవుని గంగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కె.శివారెడ్డి

టిడిపి జెండా ఎగురవేస్తున్న భూపేష్‌రెడ్డి, నాయకులు

పేదల కోసం ఆవిర్భవించిన టిడిపి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పేద బడుగు బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ మండలాధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌ఛార్జిల ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పదవులు దక్కాలన్నా, గుర్తింపు రావాలన్నా మన అధినేత చెప్పినట్లు నడుచుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి గౌరవాన్ని నిలబెట్టేందుకు ఏర్పడిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. ఆ మేరకు అందరూ అండగా ఉంటూ పని చేయాలని సూచించారు. పార్టీ గ్రామస్థాయిలో బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యం చేరుకోవచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు పెట్టుకున్న లక్ష్యం నేరవేరాలంటే కష్టపడి ఇష్టంతో చదవాలని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రెషర్స్ డే స్టూడెంట్ వెల్ఫేర్ అధ్యక్షుడు బాలకొండ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ జూనియర్స్‌కు సీనియర్ విద్యార్థులు రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. అధ్యాపకులు చెప్పిన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. బాలికలు ఆయా రంగాల్లో ముందు ఉంటే సమాజం కూడా బాగు పడుతుందన్నారు. ఆ దిశగా ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సతీష్, స్టూడెంట్ వెల్ఫేర్ అధ్యక్షుడు బాలకొండ గంగాధర్, కిరణ్మయి, డాక్టర్ నాగలక్ష్మి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఓబుల్ రెడ్డి, అరవింద్, షఫీవుద్దీన్, రామకృష్ణ, రాజారెడ్డి, వినోద్, తేజశ్వర్, గ్రంథాలయ అధికారి పి.మాధవరావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

టిడిపి మండల అధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం టిడిపి మండలశాఖ అధ్యక్షునిగా పి.నాగేశ్వరరెడ్డిని నియ మించారు. టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పి.నాగేశ్వరరెడ్డిని ఎన్నుకున్నారు. టిడిపి ఉపాధ్యక్షుడిగా పి.నాగశేఖర్, ఐటిడిపి మండల అధ్యక్షునిగా అనిశెట్టి హరికృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జిగా గోరిశెట్టి బాబు ఎన్ను కున్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్డెయ్య మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దర్గా రెడ్డెయ్య(35) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెడ్డయ్య మృతదేహం వద్ద ఉపాధి హామీ సిబ్బంది నివాళులర్పించారు. రెడ్డయ్య తిరుపతి సిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. టిడిపి నాయకుడు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డయ్య పార్టీకి కార్యకర్తగా ఉంటూ ఎనలేని కృషి చేశారని తెలిపారు. రెడ్డెయ్య కుటుంబాన్ని పార్టీ ఆదుకోవాలని పలువురు కార్యకర్తలు కోరారు. నివాళులర్పించిన వారిలో టిడిపి కార్యకర్తలు, ఎపిఒ షబ్బీర్, ఇసి గంగరాజు, టిఎలు, రంగారెడ్డి, మధు, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న వి.అన్వేష్

వీరమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని వలసపల్లె గ్రామంలో ఇటీవల మట్టి మిద్దె కూలి మృతి చెందిన వీరమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.అన్వేష్ డిమాండ్ చేశారు. జువారి పరిశ్రమ క్వారీలో జరిగే బ్లాస్టింగ్ వల్ల మట్టి మిద్దె కూలిపోయి మహిళ చనిపోయింది. ఆ మహిళ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని అన్వేష్ డిమాండ్ చేశారు. వీరమ్మ కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ సిమెంటు పరిశ్రమ మైనింగ్‌లో బ్లాస్టింగ్ వలన చాలా మట్టి మిద్దెలు గ్రామంలో కూలిపోతున్నాయన్నారు. పరిశ్రమ ద్వారా వచ్చిన కాలుష్యం వల్ల గ్రామంలో అనేకమంది కేన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వం స్పందించి గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. శనివారం ఉదయం 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వారికి న్యాయం జరగాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా

ప్రజాశక్తి - తొండూరు

సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

తొండూరు సచివాలయంలో ఉద్యోగులు అందుబాటులో ఉండడంలేదని ప్రజలు ఆరోపిస్తు న్నారు. మండల కేంద్రం కావడంతో పలువురు ప్రజలు గురువారం సచివాలయం వద్దకు వచ్చి సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. తమ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి తెలిపారు.

ఎంపీ ని సన్మానిస్తున్న నరసింహారెడ్డి

వైసిపి పిలుపుమేరకు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందన్నారు. మైదుకూరులో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తన నియామకానికి సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పులివెందులలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

రైతులకు తక్షణమే న్యాయం చేయాలి

- సిఐకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బాధిత రైతులకు తక్షణమే న్యాయం చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఆ మేరకు గురువారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్లో అంకాలమ్మ గూడూరు రైతులతో కలిసి పులివెందుల రూరల్ సీఐ రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ బయట ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ అంకాలమ్మ గూడూరు రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి గ్రామంలోని బుడ్డశనగ విత్తనాలకు, ఎరువులకు కలిపి దాదాపు రూ.25 లక్షలు వసూలు చేసుకుని పరారయ్యారని తెలిపారు. బాధిత రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. పెన్షన్లకు సంబంధించి డబ్బులు చెల్లించారు. బాధిత రైతులకు మాత్రం మూడు వారాలు గడిచినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. బాధిత రైతులు వారం రోజుల నుంచి పోలీస్‌స్టేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయం, రాజకీయ నాయకుల దగ్గరికి వెళుతున్నారన్నారు. దీనిపై రెండుసార్లు ఎస్పికి విన్నవించామన్నారు. కలెక్టర్ స్పందించి రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ నుంచి రికవరీ యాక్ట్ కింద వసూలు చేసి బాధిత రైతులకు తక్షణమే న్యాయం చేయాలని ఎంపీ కోరారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్ఐ రవికుమార్, మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహేశ్వరరెడ్డి కుటుంబానికి ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి - లింగాల

కష్టపడి పనిచేసే వ్యక్తి, పార్టీ సీనియర్ నాయకుడు లింగాల మాజీ సర్పంచ్ మహేశ్వరరెడ్డిని కోల్పోవడం చాలా బాధాకరమని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మహేశ్వరరెడ్డి నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపీ గురువారం ఆయన కుటుంబ సభ్యులు అలవాలపాటి నాగేశ్వరమ్మ, హరినాథ్‌రెడ్డి, బాలశేఖర్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా మహేశ్వరరెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన పలు అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. అండగా ఉంటామని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం మహేశ్వరరెడ్డి సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బాబు రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, యుత్ కన్వీనర్ మనోహరరెడ్డి, మల్లికేశవరెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **ANSAR ALI**, S/o. Mohammed Husain, Previously called **Mohammed Hussain Ansar Ali** (Old Name), S/o Mohammed Hussain resident of D.No.57/30, Shanti Nagar, Akkayapalli, Kadapa. YSR Dist- 516003, have Changed my name as **ANSAR ALI** (New Name), S/o Mohammed Husain.

CHANGE OF NAME

I, **FATHIMA**, W/o. Ansar Ali, Previously called **Ansar Ali Fathima**(Old Name), resident of D.No.57/30, Shanti Nagar, Akkayapalli, Kadapa.YSR Dist-516003, have Changed my name as **FATHIMA** (New Name), W/o Ansar Ali.

GEETHANJALI B.Ed COLLEGE, RAJAMPETA.

B.Ed. Admissions Notification for 2025-26

Category "B" & "A" (Left over Seats)

Application are invited from eligible candidates for the Academic year 2025-2026, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines. **Cell: 9885527711.**

Kadapa **PRINCIPAL**

BALAJI COLLEGE OF EDUCATION

(Recognized by NCTE, New Delhi & Affiliated to Yogivemana University, Kadapa.)

JAMMALAMDUGU-516434, Y.S.R. KADAPA Dist. A.P.

B.Ed. Spot & Management Quota Admissions- 2025-2026 **EDCET Code:BCJM**

Applications are invited for Admission into B.Ed Course 1. Mathematics, 2. Physical science, 3. Biological science, 4. Social Science, 5. English for the Academic year 2025-2026. Eligibility: Degree/P.G. pass with 50% for O.C. and above 40% for BC/SC/ST/PH in degree level. Application forms can collect from college from 14-11-2025. Last date for submission of applications 15.11.2025. Selection will be made as per the APSCHE Guidelines.

Vacancy Position	Category A Seats=70 EWS-10	Category B Seats=25

Contact: 9966844685 **PRINCIPAL**